క్లుప్తంగా

ముగిసిన దసరా ఉత్సవాలు



అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం కన్యకా పరమేశ్వరీ అమ్మవారి గ్రామోత్సవం, వసంతోత్సవంతో సోమవారం దసరా ఉత్సవాలు ముగిశాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చోళవేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన దసరా ఉత్సవాలు ప్రారంభించారు. నాటి నుంచి అమ్మవారిని రోజుకో అలంకారం గావించి ప్రత్యేక పూజలు చేశారు. చివరిగా సోమవారం తెల్లవారు జామునుంచి అమ్మవారికి గ్రామోత్సవం, వసంతోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు వ్యాసరచన పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మున్సిపల్ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇమామ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు హాఫీజ్ అంజాద్ బాషా సిద్దిఖి తెలిపారు. ఈనెల 17న అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ ఫౌండర్ సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ జయంతి సందర్భంగా పోటీలు నిర్వహించి, మంత్రి ఫరూక్ చేతుల మీదుగా బహుమతులతో పాటు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. మరింత సమాచారం కోసం సెల్ 9059590071 ను సంప్రదించాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దొర్నిపాడు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దొర్నిపాడు: మండలంలోని అమ్మిరెడ్డినగరంలో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా అంకన్న, ప్రదీప్, కాశీం, ఏడుకొండలు, దూదేకుల బాషా, లక్ష్మిరెడ్డి, జయరాముడులను అరెస్టు చేశామని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. వీరంతా అమ్మిరెడ్డినగరం, దొర్నిపాడు వాసులుగా గుర్తించామన్నారు. వీరి వద్ద నుంచి రూ.5,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్

చాగలమర్రి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుసేన్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన సోమవారం మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని చింతలచెరువు గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్‌డీ తాహీర్ హుసేన్, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

17న వాల్మీకి జయంతిని నిర్వహించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు జీఓ పత్రాలను అందజేస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షుడు బాలవుసేని

దొర్నిపాడు: ఈనెల 17న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించాలని మండల బోయ వాల్మీకి సంఘం అధ్యక్షుడు బాలవుసేని కోరారు. సోమవారం ఎంపీడీఓ సావిత్రి, డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, ఎస్ఐ వెంకటేష్ తదితరులను కలిసి జీఓ పత్రాలను అందజేశారు. బోయవాల్మీకి సంఘ సేవకులు విజయ్‌కుమార్, నాగశేషుడు, కిరణ్, వంశీరాజు, పెద్దినాయుడు, కుంటెన్న తదితరులు పాల్గొన్నారు.

ఖలీల్ అహ్మద్ కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల సైబర్ మోసానికి గురై బలవన్మరణం చెందిన టీచర్ ఖలీల్ అహ్మద్ కుటుంబానికి, 'ఆల్ మేవా' రూట సభ్యులు సోమవారం రూ.1.10 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా నాయకులు సయ్యద్ ఇమ్రాన్‌పాషా, సైఫుల్లా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాలకు చాలా మంది బలి అవుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

వర్షం.. రైతన్నకు కష్టం



తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన రైతు రైతు కాశయ్య తనకున్న నేను రెండున్నర ఎకరాల భూమిలో మొక్కజొన్న సాగు చేశాడు. సుమారు 95 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చిందని, క్వింటా ధర రూ. 2350ల ప్రకారం వ్యాపారులు కొనుగోలు చేసి, ధాన్యాన్ని తీసుకెళ్తామన్నారని, అయితే వర్షం కురుస్తుండటంతో ధాన్యం తడుస్తుందని కుటుంబ సభ్యులతో కలిసి ట్రాక్టరులో ఇంటికి తీసుకుళ్తున్నానని వాపోతున్నాడు. రైతుల కష్టాలు ప్రభుత్వం గుర్తించి, రైతుకు అన్నీ విధాల సహాయ సహకారలందించాలని అధికారులను వేడుకుంటున్నాడు.

- ముమ్మరంగా మొక్కజొన్న కోతలు
- కల్లాలు, రోడ్లపై ఆరబోసిన రైతన్నలు
- తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతన్నల అగచాట్లు
- గింజలు తడిస్తే ధర తగ్గుతుందనే ఆందోళన



వర్షం కురుస్తుండటంతో ముత్యాలపాడు వద్ద రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న గింజలను ఇంటికి తరలించేందుకు ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న రైతు కుటుంబం



ముత్యాలపాడు-అహోబిలం రోడ్డుపై ఆరబోసిన గింజలపై కప్పిన పట్టలపై నీటిని తొలగిస్తున్న రైతులు

చాగలమర్రి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఇక కష్టాల నుంచి గట్టెక్కినట్టేనని రైతన్నలు ఎంతో ఆశపడ్డారు. అయితే వర్షం వారి ఆశలను ఆవిరిచేస్తోంది. అసలే పెట్టుబడులు తడిసిమోపెడవ్వగా.. వర్షం నుంచి దిగుబడులను కాపాడుకునేందుకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొంతమేర గింజలు తడిసినా వ్యాపారులు ధర తగ్గించి అడుగుతున్నారని వాపోతున్నారు.

రోడ్లపైనే ధాన్యం ఆరబోత

మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు అత్యధిక శాతం మొక్కజొన్న పంటను సాగు చేశారు. పంట దిగుబడి ఎకరానికి 20 నుంచి 35 క్వింటాళ్ల మేర వస్తోంది. నెల రోజుల నుంచి పంట నూర్పిడి చేసి రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుతున్నారు. అయితే సరైన వసతి లేకపోవడంతో గ్రామాల సమీపంలోని బీటీ రోడ్లపై గింజలను ఆరబోసుకుంటున్నారు. అయితే ప్రతి రోజు వర్షం కురుస్తుండటంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. వర్షం పడితే పట్టలు కప్పడం, వర్షం రాకపోతే పట్టలు తీయడం పనిగా మారింది. దీనికి తోడు మళ్లీ తుపాను ఉండటంతో రైతన్నలు కలవరపడుతున్నారు.

ధాన్యం తడిస్తే ధరలో కోత

మొక్కజొన్న క్వింటాకు ప్రస్తుత మార్కెట్ ప్రకారం రూ.2000ల నుంచి 2500ల వరకు ధర వస్తుందని ఆశ పడినా, వర్షానికి పట్టలు కప్పినా కొంత శాతం



రుద్రవరంలో కోతలకు వెళ్లకుండా నిలిచిన యంత్రాలు

గింజలు తడవడంతో వ్యాపారులు ఉన్న రేటు మీద కోత కోస్తున్నారని రైతు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. పంట సాగుకు పెట్టిన ఖర్చులే తడిసి మోపడవుతున్నాయని, పంట నూర్పిడికి ఎకరాకు రూ.3,000 ధాన్యాన్ని ట్రాక్టరులో రోడ్ల మీదికి తరలించటానికి అద్దె, అంతే కాకుండా ధాన్యం వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ పట్టలకు రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్న రైతుల్లో గుబులు

రుద్రవరం: తుపాను ప్రభావంతో మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి వర్షం ఓ మోస్తరుగా కురుస్తూనే ఉంది. దీంతో వ్యవసాయ పనులు ఎక్కడివక్కడ నిలిచి పోయి రైతన్నల్లో ఆందోళన నెలకొంది. ప్రధానంగా మొక్కజొన్న పంట సాగు చేసిన రైతుల్లో గుబులు నెలకొంది. కొద్ది రోజులుగా మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కజొన్న కోతలు జోరుగా సాగుతున్నాయి. అయితే కొందరు రైతులు ఇప్పటికే యంత్రాలతో కోతలు కోయించి వచ్చిన ధాన్యపు దిగుబడులను ఆరబెట్టి విక్రయించుకున్నారు. మరి కొందరు కోతలు సాగిస్తున్నారు. వచ్చిన దిగుబడులను రోడ్లు, బయలు ప్రదేశాల్లో ఆరబెట్టారు. అయితే తుపాను ప్రభావంతో వర్షం మొదలయ్యింది. దీంతో కోతలు కోసేందుకు వెళ్లక యంత్రాలు ఎక్కడివక్కడ నిలిచి పోయాయి. అలాగే ఆరబెట్టిన మొక్క జొన్నలు తడవకుండా పట్టలు కప్పివుంచారు. అలాగే పట్టలు కప్పి ఉంచితే తడిగా ఉన్న మొక్క జొన్నలు రంగు మారుతాయని కొందరు, వర్షం అధికమైతే పొలల్లో ఉన్న పంట నేలవాలే ప్రమాదముందని మరి కొందరు రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితి రుద్రవరం-ఎల్లావత్తుల, కోటకొండ, రుద్రవరం-పెద్దకంబలూరు, రుద్రవరం-నర్సాపురం, నర్సాపురం-ఆలమూరు, నర్సాపురం-అహోబిలం రహదారి వెంట కనిపిస్తోంది.

కలవర పెడుతున్న తుపాను

దొర్నిపాడు: తుపాను కారణంగా రైతులు కలవర పడుతున్నారు. ముఖ్యంగా సీడ్ పత్తి రైతులు వర్షాలకు పింజలు నేలరాలుతున్నాయని వాపోతున్నారు. గత రెండు రోజులుగా క్రాసింగ్ చేయగా నిలబడిన కాయలు మొత్తం రాలిపోతుండటంతో తీవ్రనష్టం వాటిల్లుతుందని పేర్కొంటున్నారు. అలాగే ప్రస్తుతం కోతదశలో ఉన్న మొక్కజొన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కల్లాలోనే ఉండటంతో ఏమి చేయలేక పట్టలు కప్పుకోని అగచాట్లు పడుతున్నారు.



క్రిష్టిపాడులో మొక్కజొన్నకు పట్టలు కప్పుతున్న రైతు

వరించిన లక్కు

ఆళ్లగడ్డ: మద్యం టెండర్లలో నియోజకవర్గంలోని 18 మద్యం దుకాణాలకు సోమవారం లాటరీ తీశారు. ఇందులో టీడీపీ (భూమావర్గం) 7, వైఎస్సార్‌సీపీ వర్గీయులకు 5, జనసేన వర్గానికి 5 దక్కగా డీటీపీలోని ఏవీసుబ్బారెడ్డి వర్గానికి ఒక షాపు దక్కింది. విశ్వసనీయ సమాచారం మేరకు షాపులు దక్కినవారి వివరాలు

ఒకే వ్యక్తికి రెండు షాపులు

నియోజకర్గంలోని 18 షాపులకు 275 మంది దరఖాస్తు చేసుకొని తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా ఇందులో 17మంది లక్కీడ్రాలో అదృష్టం వరించింది. కాగా అన్నెం అంజనకుమార్‌రెడ్డికి ఆళ్లగడ్డ , రూరల్ షాప్‌నెంబర్ 37, 40 రెండు షాపులు దగ్గడం గమనార్హం.

మండలం	షాప్ నెంబర్	లాటరీ దక్కించుకున్న వారు	పార్టీ వర్గం
ఆళ్లగడ్డ	35	రామోహన్‌రెడ్డి	వైఎస్సార్‌సీపీ
	36	దామోదర్‌రెడ్డి	వైఎస్సార్‌సీపీ
	37	అన్నెం అంజనకుమార్‌రెడ్డి	టీడీపీ
	38	రవిచంద్రారెడ్డి	టీడీపీ
	39	శివకుమార్	టీడీపీ
ఆళ్లగడ్డ రూరల్	40	అన్నెం అంజనకుమార్‌రెడ్డి	టీడీపీ
చాగలమర్రి	41	ఇరిగెల విశ్వనాథ్‌రెడ్డి	జనసేన
	42	శ్రీనివాసులు	టీడీపీ
	43	సావిత్రి	వైఎస్సార్‌సీపీ
రుద్రవరం	47	ఆళ్ల నాగశ్రీనివాసులు	టీడీపీ
	48	మందలూరు భాస్కర్‌రెడ్డి	జనసేన
	49	పవన్‌కుమార్	వైఎస్సార్‌సీపీ
శిరివెళ్ల	50	సిద్ది సత్యనారాయణ	టీడీపీ
	51	సుధాకర్‌రెడ్డి	జనసేన
	52	రామ కోటేశ్వరావు	వైఎస్సార్‌సీపీ
	53	ఇరిగెల ప్రతాప్‌రెడ్డి	జనసేన
దొర్నిపాడు	87	నల్లగట్ల భాస్కర్‌రెడ్డి	జనసేన
ఉయ్యాలవాడ	92	సున్నం కొండయ్య	ఏవీ సుబ్బారెడ్డి వర్గం

పదోన్నతులు కల్పించాలని వినతి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

నంద్యాల(న్యూటౌన్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్‌లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఏఎన్ఎంలతో కలిసి నిరసన తెలిపారు. ఏఎన్‌ఎంలను వైద్య ఆరోగ్యశాఖలో విలీనం చేయాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ వెంకట రమణకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు పద్మావతి, బాలవెంకట్, వనజ, సుధాలక్ష్మీ, పుల్లమ్మ పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారి

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు నుంచి గిద్దలూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది.చిన్నపాటివర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచి వుండడంతో వాహనదారులు రాకపోకల సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో రహదారిలో ప్రయాణించాలంటే భయపడుతున్నామని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయం ఆ శాఖ డీఈ సునీల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తామన్నారు.



రైల్వే వంతెన కింద ఏర్పడిన గుంతలు

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన అకతాయికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం జైలు శిక్షను ఖరారు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. డేనియల్‌పురానికి చెందిన జరుపతి శివుడు శ్రీనివాస్‌నగర్ రోడ్డులో వెళ్లే మహిళలకు సైగలు చేస్తూ ఈలలు, కేకలు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి 5 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

బాణసంచా లైసెన్స్‌కు ప్రత్యేక సెల్

నంద్యాల(రూరల్): పట్టణంలో దీపావళి పండుగకు బాణసంచా విక్రయించే వ్యాపారుల లైసెన్స్‌ల పునరుద్ధరణ, కొత్త లైసెన్స్‌లు పొందేందుకు నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు నేరుగా మున్సిపల్ అధికారులను సంప్రదించి లైసెన్స్‌లను పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9491341944, 9849906654 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

'పల్లె పండుగ' భూమిపూజకే పరిమితం

రుద్రవరం: మండలంలోని కోటకొండ, చిలులూరు గ్రామాల్లో సోమవారం అధికారులు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పల్లె పండుగ అంటే ఏదో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిచేకూర్చుతున్నారని ప్రజలు ఎంతగానో ఆశించారు. తీరా అధికారులు ఆయా గ్రామాలకు వచ్చి సీసీ రోడ్ల నిర్మానానికి భూమి చేసి వెళ్లడంతో ఇంతేనా అని ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. కోటకొండలో రూ.10లక్షలతో రెండు పనులు, చిలుకలూరులో రూ.8లక్షలతో ఒక్క పనికి ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఏపీఓ ప్రతాప్, ఆయా గ్రామాల సర్పంచు వెంటేష్, ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ భగవాన్, మాజీ ఎంపీటీసీ సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని అహోబిలం గ్రామంలో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆమె భూమిపూజ చేశారు. మండలానికి రూ.2.50 కోట్లతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ఆమె తెలిపారు.

ఉయ్యాలవాడ : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.42 లక్షలతో నాలుగు గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను సోమవారం ఏపీడి సాంబశివరావు ప్రారంభించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లె గ్రామంలో రూ. 10 లక్షలు, అల్లూరు రూ. 7 లక్షలు, మాయలూరు రూ. 15 లక్షలు, రూపనగుడి రూ. 10 లక్షలతో అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్డులుగా నిర్మించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు నాలుగు గ్రామాల్లో పనులు భూమిపూజ చేశారు.



మాయలూరులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఏపీడీ సాంబశివరావు

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాలలో రూ.53.00 లక్షల ఉపాధి హామి పథకం నిధులతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీడీఓ మంజులవాణి, మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్ భూమి పూజ చేసి ప్రారంభించారు. అలాగే చింతలచెరువు గ్రామానికి రూ.15 లక్షలు, పెద్దవంగలి గ్రామానికి రూ.15 లక్షలు, చిన్నవంగలి గ్రామానికి రూ.23 లక్షలు మంజురైనట్లు వెల్లడించారు. ఈఓపీఆర్‌డీ తాహీర్ హుసేన్, ఏఈ కొండారెడ్డి, ఏపీఓ నిర్మల, సర్పంచ్‌లు మాధవి, మౌలిబాషా తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి గోవిందనాయక్ ఆధ్వర్యంలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్డీ సులోచన, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, కాశీవిశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాసవీమాతకు పాన్పుసేవ



పాన్పుసేవలో అమ్మవారు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో శ్రీవాసవీమాతకు సోమవారం పాన్పుసేవ నిర్వహించారు. శ్రీమత్కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలోఅర్చకులు పూలేటికుర్తి రాధాకృష్ణస్వామి ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రాత్రి అమ్మవారికి పాన్పుసేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు వంకదార లక్ష్మణబాబు, ఉపాధ్యక్షుడు బచ్చు సుబ్రమణ్యం, కార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణ, కోశాధికారి కె.రామక్రిష్ణ వరప్రసాద్ పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వజ్రాల చీర అలంకారంలో వాసవీ మాత

నంద్యాల(వ్యవసాయం): పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో ఊరి విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. వజ్రాల చీరతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కాశీ అన్నపూర్ణ సత్రాల అధ్యక్షుడు, పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు మాట్లాడుతూ.. ఏటా దసరా పండుగ అనంతరం పట్టణంలోని ఆర్యవైశ్య కుటుంబాలతో అమ్మవారిశాలలో ఊరివిందు కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఆర్యవైశ్య సభ్యులు బైసాన్ని రామశేషు, ఇందుమతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని న్యాయ, రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లో మూడు నూతన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా మాట్లాడుతూ నూతన బస్సుల్లో హైదరాబాద్‌కు రెండు సూపర్ లగ్జరీ బస్సు, ఒకటి శ్రీశైలానికి ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను నడుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, ఎన్ఎండీ బాషా, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల ప్రారంభం

నంద్యాల(రూరల్): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లను జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారమే అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి విడతలో 100, రెండవ విడతలో 75 అన్న క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం అన్న క్యాంటీన్‌లకు వచ్చిన ప్రజలకు భోజనాలు వడ్డించి ప్రజలతో కలిసి అక్కడే మంత్రి, కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

విత్తన నాణ్యతలో తేడాలొస్తే చర్యలు

నంద్యాల(రూరల్): విత్తన నాణ్యతలో తప్పులు జరిగితే విత్తన చట్టం 1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ హెచ్చరించారు. రబీ సీజన్ కోసం రైతులకు సబ్సిడీపై సరఫరా చేస్తున్న పప్పు శనగ విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్న బాలాజీ సీడ్స్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. విత్తనాలు సరఫరా చేసే రైతుల వివరాలతో కూడిన రిజిస్టర్, ప్రాసెసింగ్ చేసే విధానంపై అవగాహన కల్పించామన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా సరఫరా చేసే విత్తనాలు కాబట్టి నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలన్నింటిని పాటించి విత్తనశుద్ధి చేసిన తరువాతే రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించామన్నారు. విత్తన నాణ్యతలో ఏదైనా తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏడీ వెంట మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.



విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీ రాజశేఖర్

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో పలు క్రీడాంశాలల్లో నంద్యాల జిల్లా జట్లకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.కోటయ్య సోమవారం తెలిపారు. గత నెల ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొని వివిధ అంశాలలో ప్రతిభ కనబరచడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. కబడ్డీ అండర్-17లో సమీరా, వాహిద, ఫరీద్ బాషా , అండర్-14లో చిన్న, బ్యాడ్మింటన్ అండర్-14లో పి.సోహెల్, వాలీబాల్ అండర్-17 శశికిరణ్, అండర్-14 షాహిద్, హరినరసింహ్మ, కోకో అండర్-17 పి.మాబుషరీఫ్, తిమోతి, యోగా అండర్-17 సాజీద్, అండర్-14లో అఖిల్ కుమార్‌లు ఎంపికైనట్లు పీడీ దాదాపీర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ భారతి, ఉపాధ్యాయులు వసంత లక్ష్మి, కళ్యాణి, ప్రవీణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న మార్కెట్ యార్డు



మార్కెట్ యార్డులో పేరుకుపోయిన మురుగు

నంద్యాల(రూరల్): పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో సరైనా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు యార్డులోని ఖాళీ ప్రదేశాలకు చేరి కంపు కొడుతున్నాయి. మార్కెట్ యార్డుకు నిత్యం వందల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఒక్కోసారి రైతులు తెచ్చిన పంటను అమ్ముకోవడం కోసం యార్డులోనే బస చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే మురుగు నుంచి వస్తున్న దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా యార్డులోని రైతు బజార్‌కు కూరగాయాలు కొనడానికి ప్రతి రోజు ఉదయం వందల మంది ప్రజలు వస్తుంటారు. వీరంతా ముక్కుమూసుకుని రైతు బజారుకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని పట్టణ ప్రజలు, రైతులు కోరుతున్నారు.